కథ

# ఆపద్ధర్మం

శీతంరాజు చిట్టిబాబు

పళ్ళు బ్రష్ చేసుకుంటుంటే చెప్పింది శ్రీమతి, ఇంట్లో కూరలేంలేవు. ఇప్పుడే పెద్ద మార్కెట్‌కు వెడితే, తాజా కూరలు చవగ్గా దొరుకుతాయి" అని.

"అట్లాగే అన్నా" విసుక్కుంటూ

"విసుక్కుంటే యెట్లాగండీ? పిల్లలా పెద్దవాళ్ళయి చెరో వూళ్ళో వుద్యోగాల్లో వున్నారు. సొంత వూరంటూ, స్వంతయిల్లంటూ వచ్చాం. ఆఫీసరుగిరీ అయిపోయింది. ఎవరొచ్చి చేస్తారిప్పుడు మనపనులు? నవ్వుతూనే అంది.

"సరేలే నీ పరిహాసం" అని కాఫీ తాగి బయల్దేరా.

మేడ దిగుతూ వుంటే మెట్ల ప్రక్కన వెంటిలేటరు లోంచి, లోగొంతులతో సుజాతా కమల ఘర్షణ వినిపిస్తోంది. చెవిమొగ్గుతూ ఆగిపోయా, అటుచూస్తూ.

"ఆడబ్బువాడిమొహానే కొట్టు. నా జీవితం నాశనం చేశావుగదే. నీవో తార్పుడు దానివని తెలియక స్నేహం చేశా. ఇకనువ్వెవరో నే నెవరో" అంటూ సుజాత కదలబోతుంటే, ఆమెచెయ్యి పట్టుకుని ఆపుతూ.

నేను ప్రమాణంచేసి చెప్తున్నా వినవేంటే? నేనటువంటి ఛండాలపుదాన్నికానే. వాడిని నేనుయెట్లా తిట్టానో, యెంత అసహ్యించుకున్నానో నీకు తెలియదు, జరిగిన దానికి నేనూ యేడుస్తున్నా. పొద్దున్నే అన్నయ్య వదినెలు ఫ్యాక్టరీకి వెళ్లగానే వాడు ఆరింటికల్లా వచ్చి అన్నయ్యతో చెవ్పద్దని బ్రతిమాలాడు. కళ్లనీళ్లతో బాధపడుతూ, తనను క్షమించమనినీతో చెప్పి,యేదన్నా కొనుక్కోమని యీ 500/- నీకివ్వమన్నాడు. అంతా మర్చిపొమ్మని కూడా చెప్పమని యేడ్చాడు" అంది కమల.

ఛా, పోవే, ఇంకా సిగ్గులేక మాట్లాడుతావు" అని కదలపోయింది సుజాత, చెయ్యితొక్కుంటూ

"ఆ డబ్బుసంగతి, వాడి సంగతి వదిలెయ్. మన యెడమొహం పెడమొహాలు కనిపెడితే,యింటి వాళ్లు మీ వాళ్లు కూడా అనుమానంతో పసిగట్టి కూపీలాగుతారు. గందరగోళం అవుతుంది. నేనెక్కడో యింకో యిల్లు చూసుకుని పనికి కుదుర్తా. నీ కట్లా కాదే నిన్నిక్కడ్నుంచి మీ బంధువులు వెళ్లగొట్టటం, అక్కడ మీ వూళ్ళో మీ వాళ్ళు రాచిరంపాన పెడుతుండటం, మళ్లీ నీ తిండికి కూడా కరువయ్యే స్థితి. బయటికి తెలిస్తే పెళ్లికూడ కాదు. అందుకే చెప్తున్నా . అంతా పీడకల అనుకుని మర్చిపో" అంటోంది కమల.

అదో జులాయి గొడవలే అనిపించి, అసహ్యించుకుంటూ ఏమీతెలీనట్లే ,వాళ్లను నోటీసు చేయనట్లే, చెప్పులు చప్పుడుచేస్తూ దిగి స్కూటరెక్కి వెళ్లిపోయా.

బజారు కెడుతున్నా,తిరిగొస్తున్నా, యే పని చేస్తున్నా, కూరలు శ్రీమతికిచ్చిహాల్లోకి వస్తున్నా, యింకాసుజాతకమలల తగాదామనసులో చక్కెర్లు కొడుతూనే వుంది. సోఫాలో కూర్చుని పేపరు తెరిచానేగాని, అక్షరాలు కదలకుండా ముందురోజు సంగతి ఫ్లాష్‌లా మనో నేత్రంలోకి వచ్చింది.

ఆరోజు ప్రొద్దున మామూలుగా పిట్టగోడ ప్రక్కన కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నా. సుజాతా కమలలు యెకసెక్కాలతో, నవ్వులు రువ్వుకుంటూగేటు తీసుకుని వెడుతుంటే చూశా. సుజాత పట్టుపరికిణీ, జాకెట్టు,మ్యాచింగ్ వల్లె వేసుకుని పెళ్లి కూతురులావుంది, దిష్టితగిలేట్టు.

తరువాతో స్నేహితుడొచ్చి వో గంటసేపు కబుర్లాడి వెళ్లగానే స్నానానికని లేచా. మళ్లీ గేటు చప్పుడైతే అటుచూశాను. సుజాత వక్కతే, రేగిన జుట్టు,నలిగిన దుస్తులు, వాడిన ముఖంతో వచ్చి యింట్లోకి వెళ్లింది. గాయాలేవి అయినట్లనిపించక యేదో చిన్న యాక్సిడెంటయివుంటుందిలే అనుకుంటూ స్నానానికి వెళ్లా.

వళ్లు తుడుచుకున్న టవల్ తీగమీద ఆరెయ్యటానికి బయటికి వచ్చినపుడుచూడటం జరిగింది. తలకొప్పుకు టవల్ చుట్టుకుని, యింట్లోంచిసుజాతఆపట్టు డ్రస్సుపట్టుకొచ్చిచప్తామీది పంపుక్రింద తడపడం. అప్పుడుమళ్లీయే మీ అనిపించలేదు.

ఆఫీసు హడావుడులు, వుద్యోగబాధ్యతలు, పనివత్తిడులు అన్నీ రిటైర్మెంటుతో నేపోయి విరామం పెరగటం వల్లనేమో,ప్రత్యేక విషయంలా యేదిఅనిపించినా, కనిపించినా, దాన్నిగురించి ఆలోచించటం, యేమిటో తెలుసుకునేటంతవరకు వదలక పోవటం అలవాటయిపోతోంది. దాన్ని చాదస్తం అని ముద్రవేసింది కూడా మాశ్రీమతి!

ముందురోజువిషయం,ఆరోజు జగడం మళ్లీమళ్లీ మనసులోకి వస్తూ,వూహల్లో వోదుర్ఘటనగా రూపొందినై. క్రింద అద్దెకున్న ఆఫీసరు వూళ్లోలేడు. రెండురోజులు ముందుముసలి తల్లిని , సుజాతను వుంచి, నాలుగురోజులు సెలవు మీద భార్యా కొడుకులతో బంధువుల పెళ్లి కని వెళ్ళాడు. అందువల్ల యీ సంగతి బయటకుపొక్కకుండా , అంతటితో సమసిపోతే బాగుండునని, కమల సుజాత తో అన్నదంతా సమంజసమేనని నాకూ అనిపించి, వాళ్లిద్దరి మధ్య సయోధ్యకు పూనుకోవాలనుకున్నా. .సుజాత సంగతులు, ఆమె మంచితనం గురించి లోగడ అప్పుడప్పుడు నా శ్రీమతిచెప్పటం వల్ల సుజాత అంటే జాలికూడ కలిగింది. బాల్యచాపల్యం కొంత అఘటనకు కారణం అయ్యుండానుకున్నా.

సుజాత క్రింద అద్దెకున్న ఆఫీసరుకు బీరకాయ పీచుచుట్టరికం వున్నబీదపిల్ల. తల్లివంటలు చేస్తూ, తండ్రి యేదో ప్రెస్సులో చిల్లర పనులు చేస్తూ వాళ్లవూళ్లో సంసారం గడుపుకుంటున్న స్థితిట. ఒక్కతే

సంతానంగా, గారాబంగా అల్లరి చేస్తూ, ఆలస్యంగా స్కూల్లో చేరిన సుజాత యేడో క్లాసు తప్పికూర్చుంది. అందువల్ల, తల్లి తండ్రులు, యెరుగున్న భాగ్యవంతులెవరినో బ్రతిమాలి, వాళ్ళింట్లో పిల్లల్ని ఆడించటానికి, తిండి గడి చేటట్లు యేర్పాటు చేసుకున్నా,ఆపిల్లలు లేని పోని చాడీలు చెప్తూవుంటే, అన్యాయంగావుద్వాసన జరిగిందట. ఇకయింటి పట్టునేవుండి, యే పనీ చేయకుండా కుటుంబానికి బరువుగా తయారయితే, యేదో చిరుద్యోగిగా ఆవూళ్లోనే వుండే ఆమె బాబాయి యీ ఆఫీసరుతో పరిచయం వుండి, వీళ్లింట్లో చిన్న చిన్న పనులు చేస్తూ, పిల్లాడి పనులన్నీ ప్రత్యేకంగా చూస్తూ భుక్తి గడుపుకునేటట్లు చేశాడట.

తెలివిగల పిల్లే అవటం చేత , సుజాత కాస్త జ్ఞానం తెచ్చుకుని మంచి గా యింట్లో అనేక పనులు చక్కగా చేస్తూ, వీళ్లబాబును కాన్వెంటుకు తీసుకు వెళ్ళడం, తీసుకు రావటం, అతని పనులన్నీ శ్రద్ధగా చేస్తూ వుండటంతో యింట్లో అందరినీ ఆకట్టుకుంది

ఆఫీసరు యింటి వాతావరణంతో స్టైలు,కాస్త హుందాతనం, ఆరిందాగా మాట్లాడటం కూడా సుజాతకు అలవాటైనాయి, అట్లాగే నలుగురు వాడుకలో దొర్లించే ఇంగ్లీషు పదాలు వాడటం కూడా పట్టుబడింది. ఆస్థాయి అంతకు పూర్వమే వుండి, సమ వయస్కురాలైన పనిపిల్ల కమలతో స్నేహమై, ఆ స్నేహం మితాన్ని మించిపోయింది.

× × ×

నా శ్రీమతి సహకారంతో సుజాత కమలల స్నేహంపునరుద్ధరించి, నేను వూహించిన అత్యాచారం జరిగినట్లు తెలుసుకున్నా. ముందురోజుకమల పని పూర్తయి యింటికి వెడుతుంటే, గుడికి వెళ్లటానికని సుజాత తయారయిఆమె వెంట బయలు దేరింది. కమల యింటి మీదుగానే గుడికి దారి అవటంచేత, తిరిగి వచ్చేప్పుడు ఆగి, తనతోపాటు కాఫీ తాగి మరీ వెళ్ళాలని కమల సుజాతతో చెప్పింది.

సుజాత గుడి నుంచి కమలయింటికి వచ్చినపుడు,కమల అన్నయ్యస్నేహితుడుగోపీ అప్పుడే వచ్చిఅక్కడ వున్నాడు. ప్రక్క పల్లెలో వున్న వాళ్ల బాబాయి గారింటికి ముందురోజు వచ్చి, ఆరోజున తిరిగి వాళ్లవూరు వెడుతూ కమల యింటికి వచ్చాడు. కమల అతన్ని సుజాతకు పరిచయం చేస్తూ, అతను తనకింకో అన్నయ్యలాటి వాడని కూడా చెప్పింది. ముగ్గురు మాట్లాడుకుంటున్న సందర్భంలో సుజాతను కాఫీ తాగటానికి మొదటిసారి పిలిచానని గోపీతో అంది. వట్టి కాఫీయేమిటి, స్వీటు హాటులతో పార్టీ యివ్వాలని అతను అన్నాడు. కమల అవుననటుంటే సుజాత అవేం వద్దులే కాఫీ చాలు అంటున్నా, ఇద్దరికీ తన యింట్లో పార్టీ యిచ్చినట్లవుతుందని కమలకు ఉత్సాహం కలిగి వెంటనే వాళ్లను కబుర్లు చెప్పు కుంటూ వుండండి, పావుగంటలో బిస్కట్లు, కేకులు తెస్తానంటూ బయటికెళ్లింది.

గోపీ పలకరింపులకు, సుజాత సజావుగా మాత్రమే మాట్లాడుతున్నా, పిచ్చివేషాలంటివి యేమీ వేయకపోయినా, అతను ఆమెతో తియ్యటి కబుర్లుచెప్తూ, ఆమె పరిచయం తనకు అదృష్టం వల్ల కలిగిందని, ఆమె తనకు తగిన జోడీ అని, పెళ్లి చేసుకుంటానని, అంటూ, బలవంతానఅఘాయిత్యం చేసి, ఆమె యేడుస్తూ ఉంటే పారిపోయాడు. సుజాత, కమలరాగానే తిట్టిపోస్తూ, అంతా ఆమె కావాలనే చేసిందంటూ, ఆమె యేమి చెప్తున్నా వినిపించు కోకుండా యింటికి తిరిగి వచ్చిందట.

గోపీ వివరాలు తెలుసుకుని, సుజాతా కమలలు మళ్లీ మామూలులా స్నేహంగా వుండేట్లు, జరిగిన విషయం కమల అన్నయ్యకు గాని, మరియెవరికి గాని చెప్పకుండా వుంటేట్టు వాగ్దానాలు తీసుకుని వాళ్ళను పంపించేశా. అంతా అవగానే మా శ్రీమతి, హైరానా పడి వుత్సాహంగా అంతా కనుక్కున్నారు, చేసే ఘన కార్యంయేమన్నావుందా అంటూ నవ్వి,గృహకృత్యాల్లోకి వెళ్లిపోయింది.

× × ×

సుజాతా కమలలు మళ్లీ కలిసిపోయినా, ఆ ఘటనను రహస్యంగా వుంచగలరేగాని, సుజాతకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దలేరు. ఆ సుజాత కుమిలిపోతూ వుండవలసిందే. మర్నాడు ఆ ఆలోచన రాగానే, సమాజంలో సంస్కృతి గల వొక పౌరుడిగా బాధ్యత వహించి, మంచియేమైనా సరే, సుజాతకు చేయగలగాలి అనేభావన వచ్చి, కార్యాచరణలోకి వెంటనే దిగిపోయా. ఆ రోజే గోపీ వాళ్లవూరు వెళ్ళాను. అతని తండ్రి వో పెద్ద బట్టల షాపులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతన్ని పరిచయం చేసుకుని, విషయమంతా వివరించి, యిప్పుడు యేం చేయాలో మీకుతెలుసనుకుంటా" అన్నా.

"అటువంటివి అనేకం అనేక చోట్ల దురదృష్ట వశాత్తు జరుగుతూనే వుంటాయి కదండీ. పది మందిలో అల్లర్లయిన కేసులు కూడ సర్దుకు పోతుంటాయి. నేనుమావాడిని ముక్క చివాట్లు పెడుతాను సర్. దయచేసి ఆవిషయం మీరు మర్చిపొండి" అన్నాడు.

"అట్లాకాదు అన్నీ తెలిసిన మనం న్యాయం, ధర్మం ఆలోచించాలీ, పాటించాలీ" అన్నా.

ఏం ధర్మం సార్. వాళ్ళేం చిన్న పిల్లలు కారు. అఘాయిత్యం కాదు. అది అమ్మాయి యిష్టం మీదే జరుగుతుందిసార్. ఆకుటుంబంసంగతి మీకు నాకు తెలియదు. నన్ను క్షమించి యిక ఆ సంగతి వదలండి సార్' అన్నాడు.

నాకు చెప్పలేనంత కోపం వచ్చినా అణచుకున్నా. నా కారణంగా మంచి జరగాలని వచ్చిన వాడినయేమరి.

"అట్లా అనద్దు. అది దారుణం అని తెలిసిన మనం, సామాజిక బాధ్యతతో సరిదిద్దాలి.

నేను చూసిన వాటిని బట్టి, విన్న ఆ పిల్లల మాటలను బట్టి, తప్పు మీ అబ్బాయిలోనే వున్నట్లు నిర్ధారణ అవుతోంది. ఆ అమ్మాయి సుజాత గుణవంతురాలు పనిమంతురాలుగా మా దంపతులం యెప్పుడో గమనించాం అందమైన దేకాక, సుహాసినీ, సుమధుర భాషిణీ అనే పదాలు కూడ ఆమెకు వర్తిస్తాయి", అన్నాయెంతో మృదువుగా.

" అట్లా అంటున్నారు.మా అబ్బాయి మాత్రం యేం ? బి.కాం. పాసయ్యాడు. బ్యాంకు వుద్యోగానికి సెలక్టయ్యాడు. అందంతో పాటు మంచితనం కూడా వుందని అందరూ అంటూ ఉంటారు.



నన్నయ్య భట్టారక పీఠం, తణుకు ఆధ్వర్యంలో 27-6-2009న జరిగిన జి.ఎల్.ఎన్. మూర్తి రచించిన 'నాన్నతో' పుస్తకావిష్కరణ సభలో సోమేపల్లి వెంకట సుబ్బయ్య, డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు, డా॥ ముక్కపూడి హరిశ్చంద్రప్రసాద్, కొప్పర్తి, ఎం. రామచంద్రరావు తదితరులు.

పెళ్ళి చేయాలను కుంటున్నాం. మంచి సంబంధాలు వస్తున్నాయి" అన్నాడు, నాలో మంచితనం చూచి. "బాగుంది! వేరే సంబంధాల ప్రశ్నేలేదు. అతనికి తగిన అమ్మాయి సుజాత , ఆమెకు తగిన వాడతను, అతను మామూలుగా మంచివాడనే విన్నాను" అన్నా, ఆయన సంతోషించటానికి.

"అదేమిటండీ అట్లా అనేస్తున్నారు. సరితూగే సంబంధం అవునాకాదా? సాంప్రదాయం యెటు వంటిది, అసలు వంశం సంగతి యేమిటి వగైరా అన్నీ చూడాలికదండీ పెళ్లంటే" అన్నాడు, కొద్ది చనువు తీసుకుంటున్న మాదిరి.

ఒంకర తాడిచెట్టుకు పిల్లనిస్తానంటే, అది నిట్టనిలువుగా నిలబడుతుందనే సామెత గుర్తు కొచ్చింది. అంత వరకు నేను సున్నితంగా మాట్లాడినా, విషయం సానుకూలం అవాలంటే, ముందర ఆయన్ను కంట్రోలు చేసి, దిగివచ్చేటట్టు చేయాలి. అందుకని

"చూడండీ. మీరో దోషికి తండ్రి అనే మాట మర్చి కేవలం పెండ్లి కుమారుని తండ్రిలాగే మాట్లాడుతున్నారు. ఆమె వంశం మంచీ మర్యాదలు కలదే అని తెలుసు. అయితే కట్న కానుకలు, అంతస్థులుఅంటూ ఆలోచించే పరిస్థితి లేదు. మీ అబ్బాయి నేరస్తుడుగానిలబడితే జరిగే పర్యవసానం మీకు తెలుసు. ఎవరికీ మంచిదికాదుకూడా" అన్నా కొంచెం ఘాటుగానే.

నా మాటలు, సమాజంలో సహజంగా నాకుండే విలువ వలన ఆయనకు హెచ్చరికలావుండి కాస్తజం కాదు, కొడుకు వున్నస్థితి బాగా గ్రహింపుకు వచ్చి వుంటుంది.

"ఆపరిస్థితి రానివ్వనులెండిసార్! సామాన్యుల సాధక బాధకాలు, కష్ట సుఖాలు నాకుతెలుసు. కాకపోతే అందరు తండ్రులులాగ కొడుక్కు గొప్ప మంచి సంబంధం కావాలి అని నేనూ కోరు కుంటున్నా. ఆమాటకొస్తే మీరైనా......", చెప్పటం పూర్తి చేయటానికి సందేహించాడు.

"ఆగండి ,ఆగండి! నా యిద్దరు కొడుకులు యిటువంటి పరిస్థితులు తీసుకురాకుండా పెళ్లిళ్లై సంసారాలు చేస్తున్నారు. నాకు కూతుళ్లులేరు" ఆయన వుద్దేశ్యం గ్రహించినట్లన్నా.

" అయితే .... " అడగటానికి ధైర్యం రానట్లు ఆగాడు.

నేను చేయిపైకెత్తి ఆగమని సౌంజ్ఞ చేస్తూ నవ్వాను. కన్యాదానం మీరు చెయ్యగూడదా అని ఆయన అడగబోతున్నట్లనిపించింది, నిజానికి కొడుకులు చదువుకునే రోజుల్లో నాకు కూతురు లేదని, ఆముచ్చట తీరలేదని బాధ పడేవాడిని . అది యిప్పుడు గుర్తువచ్చి అనిపించింది. నేను, నా శ్రీమతి సుజాత పెళ్లి చేస్తే బాగుండి, ఆ సద్ధర్మం అవుతుందని, అలాచేద్దామని నా వుద్దేశం నేను వెంటనే బయటపెడితే, ఆయన మళ్లీ మెట్టెక్కుతాడేమో అనిపించింది.

"అయితే", అని యేదో చెప్పబోయారు. సందేహమెందుకు, చెప్పండి", అన్నా పెద్దరికంగా

"క్షమించి, నన్ను తప్పు పట్టకండి. దయతో మీరే కన్యాదానం చేసి పుణ్యం కట్టుకుంటే బాగుంటుందనుకున్నా'', అన్నాడు. ఒకవైపువప్పుకోనసే వుద్దేశం అవచ్చు, అట్లాకాక పాచిక పారితే, తన బంధుమిత్రులందరు గొప్పసంబంధం వచ్చిందని గౌరవిస్తారనే భావన అవచ్చు.

సాధించాననే సంతోషంతో గట్టిగా నవ్వి" అట్లాగే అంతకంటేనాకేంకావాలి. సుజాతను నామోహ పుత్రికగా పరిగణిస్తా! లక్షణంగా, ఘనంగా వివాహం జరుపుతా. నాకు మంచి కూతురు, కట్నం తీసుకోని మంచి అల్లుడు దొరకటం గొప్ప అదృష్టం. ఇక పెళ్లితతంగంప్రారంభిస్తా'' అన్నా, ఆనందోత్సాహాలతో

" ఇక నేను యే కోరికా కోరకుండా, నోరు తెరవకుండా చేసేశారు''అనిమళ్లీనెమ్మదిగా వినయంగా, "ఘటికులు బావగారు !" అన్నాడు చుట్టరికంకలుపుతూ, ఆనందంతో.. వివాహ భోజనానికి కూర్చుంటే నోరూరుతూ, తెరవక మానరులెండి! ముందుగా తాంబూలాలకు కలుద్దాం" అని విజయ సాధనతో తిరిగొచ్చాను.

సంబంధీకులు యెవరూ గాని, అద్దెకున్న ఆఫీసరుగాని, యే అభ్యంతరం, ఆక్షేపణ చెప్పక సహకరించటంతో కళ్యాణం కమనీయం చేయగలిగాను.

వీటలమీద వేముకూర్చున్నప్పుడు నాశ్రీమతితో " నాఘనకార్యం చూశావుగా" అంటే

" ప్రక్కన నేనుంటేనేగా" అంది కొంటెగా నవ్వుతూ.

# ఏడురంగుల ఊసరవెల్లి

## ఈతకోట సుబ్బారావు

నవ్విస్తుంది
ఏడ్పిస్తుంది
వొకచోటకవ్విస్తుంది!
కళ్లలో ఆశ
పెదవిన చిర్నవ్వు
ద్విపాత్రాభినయంలోదిట్ట!
పెట్టినచేత్తోనే
చెంపఛెళ్లుమనిపిస్తూ
వెన్నకూడారాసి పెడ్తూ
నానా రసాలు వొలికిస్తుంది!
నోటితో పొగడుతూ
నొసటిని చిట్లిస్తూ
చూపులతో వంచిస్తూ
అర్థంకాని ప్రబంధ కావ్యం!
చౌరస్తాలో నించోబెట్టి
దిక్కుతోచనివ్వదు
దిక్కులు గుర్తిస్తామేమోనని
మేఘమై దిక్కూచిని కమ్మేస్తూ!
ప్రేమిస్తుంది ద్వేషిస్తుంది
కలగాపులగంగా మనిషిని
మనసుతీరా కౌగిలించుకుంటూ
అంతాఅర్థంకాని నటన
మనిషి మాయచేసే
ఏకైక నిర్వచనం జీవితం-
ఏడురంగుల ఊసరవెల్లి!